# కథ

రాత్రి తొమ్మిది గంటలయింది.

గుంటూరు బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దాదాపు వంద బస్సులు వివిధ ప్రాంతాలకు వెళ్ళడానికి సిద్ధంగా వున్నాయి.

ప్రయాణికులు లగేజీలను చేతబుచ్చుకుని అటు ఇటు పరుగులు తీస్తున్నారు.

ఓ అరుగు మీద రెండు సూట్‌కేసులు, ఒక బుట్ట పెట్టుకుని కూర్చున్నారు వృద్ధ దంపతులు గోపాలరావు, వరలక్ష్మి.

టీవీ సెట్లలో ఏవో ప్రకటనలు ప్రసారమవుతున్నాయి. కొంతమంది వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.




వృద్ధ దంపతులు కూడా నోళ్ళు తెరుచుకుని అటే చూడసాగారు.

అకస్మాత్తుగా ఒక ప్రకటన వచ్చింది.

''ప్రయాణికులకు ఆర్టీసీవారి విజ్ఞప్తి. కొంతమంది దొంగలు ప్రయాణికుల రూపంలో బస్సుల్లో వస్తుంటారు. దోపిడీ జరిగిందాకా ఎవరు దొంగలో, ఎవరు ప్రయాణికులో తెలియదు. కావున ప్రయాణికులందరూ వీలైనంత తక్కువ లగేజీలతో ప్రయాణించండి. ఆభరణాలు ధరించవద్దు. ప్రయాణంలో అప్రమత్తంగా ఉండండి.''

ఉలిక్కిపడి తన లగేజీవైపు చూసాడు గోపాలరావు. మూడు శాల్తీలు భద్రంగా వున్నాయి.

''ఏమేవ్! చూస్తున్నావుగా. కాస్త జాగ్రత్తగా ఉండు. మంగళసూత్రాన్ని జాకెట్‌కు పిన్ చెయ్యి. ఎర్ర సూట్‌కేసును జాగ్రత్తగా చూస్తుండు'' సహజ ధోరణిలో అన్నాడు గోపాలరావు.

**''ఆర్టీసీ వారికి ప్రయాణికులను దోచుకోవడమేతప్ప ప్రయాణికుల భద్రత ఏమాత్రం పట్టదు. ఎవడి చేతిలో కత్తి వుంటుందో ఎవడి జేబులో బాంబు వుంటుందో తెలియదు. గమ్యం చేరితే అదృష్టమే'' ఇరవై ఏడో సీట్లో ఆయన ఓ విసురు విసిరాడు.**

''ష్! నెమ్మదిగా మాట్లాడండి. నలుగురూ వింటారు'' గొణిగింది వరలక్ష్మి.

హైదరాబాద్‌లో తన మేనల్లుడి పెళ్ళికి భార్యతోసహా బయలుదేరాడు గోపాలరావు. ఆయన స్కూలు టీచరుగా పనిచేసి ఐదేళ్ళ క్రితం రిటైరయ్యాడు. నలభై ఏళ్ళు టీచర్ వృత్తిలో వుండడం వలన రోజూ అరవై మందికి గొంతెత్తి పాఠాలు చెప్పే అలవాటు కావడంవలన చిన్న విషయాన్ని కూడా పెద్దగా చెప్పడం ఆయనకు అలవాటైపోయింది.

తొమ్మిదిన్నరకు హైదరాబాద్ బస్సు వచ్చింది.

''మంగళసూత్రం జాగ్రత్త. ఎర్ర సూట్‌కేసు జాగ్రత్త'' మళ్ళీ అన్నాడు గోపాలరావు.

నల్ల బ్యాగ్, బుట్టపైన పెట్టి ఎర్ర సూట్‌కేసు మాత్రం ఇద్దరి కాళ్ళ మధ్య పెట్టాడు గోపాలరావు.

బస్సు నిండింది.

ప్రయాణికులందరినీ జాగ్రత్తగా గమనించసాగాడు. అందరూ టిప్‌టాప్‌గా ఉండి పెద్ద పెద్ద సూట్‌కేసులను, ఎయిర్ బ్యాగ్‌లను భారంగా అటకమీద పెడుతూ సీట్ల నెంబర్లను చూసుకుంటున్నారు.

''వీళ్ళల్లో దొంగలెవరో, దొరలెవరో కనిపెట్టడం ఎలా? ఎవడి ముఖాన దొంగ అని రాసి వుండదు కదా?'' అన్నాడు గోపాలరావు.

ఆయన వెనుక సీట్లో ఇద్దరు యువకులు కూర్చుని వున్నారు.

వారిలో ఒకతను నవ్వుతూ ''అసలు బస్ ఎక్కేటప్పుడే అందరినీ ధరోగా చెక్‌చేసి అనుమతించాలి. ఇదే అమెరికాలో అయితేనా?'' అంటున్నాడు.

''అమెరికా దాకా ఎందుకు? మన దేశంలోనే విమానం ఎక్కేటప్పుడు బట్టలూడదీసి చెక్ చేయడంలా?'' అన్నాడు మరో యువకుడు.

''ఆర్టీసీ వారికి ప్రయాణికులను దోచుకోవడమే తప్ప ప్రయాణికుల భద్రత ఏమాత్రం పట్టదు. ఎవడి చేతిలో కత్తి వుంటుందో ఎవడి జేబులో బాంబు వుంటుందో తెలియదు. గమ్యం చేరితే అదృష్టమే.'' ఇరవై ఏడో సీట్లో ఆయన ఓ విసురు విసిరాడు.

''ఎవరి జాగ్రత్తల్లో వాళ్ళుండాలి. పాపం ఆర్టీసీ వారు మాత్రం ఎంతని చేయగలరు? టికెట్ చెక్ చేసేటప్పుడు నువ్వు దొంగవా, దొరవా అని అడగలేరు కదా?'' సానుభూతిగా అన్నాడు మరొకాయన.

''దొంగలంటే మహా ఇద్దరో ముగ్గురో వుంటారు. మిగిలిన ముప్పైమందిమి ఏకమైతే ఎముకలు విరగ్గొట్టలేమా? కత్తి చూస్తే వణుకుతారాయె జనం'' విమర్శించాడో కుర్రాడు.

గోపాలరావు బస్సులో ప్రయాణికులందరినీ తేరిపార చూసాడు.

పదిమంది స్త్రీలు, ఇరవై నలుగురు పురుషులు వున్నారు. వారిలో ఇరవైమంది దాకా తమలాంటి వృద్ధులే. అనుమానించదగ్గ వారెవరూ కనిపించలేదు.

పది గంటలకు బస్సు బయలుదేరింది.

క్షేమంగా గమ్యం చేర్చమని భగవంతుడిని ప్రార్థించాడు గోపాలరావు.

ఊరు దాటగానే లైట్లు ఆఫ్ చేసాడు డ్రైవరు.

''ఏమేవ్! నిద్ర పోకు. ఎర్ర సూట్‌కేస్ జాగ్రత్త'' అరిచాడు గోపాలరావు.

''అబ్బ...నా కాళ్ళ దగ్గర ఉందిలే అరవకండి'' విసుక్కుంది వరలక్ష్మి.

విజయవాడలో పది నిముషాలు ఆగింది బస్సు. ఎవ్వరినీ ఎక్కనివ్వలేదు కండక్టరు.

''ఏమేవ్ ఎర్ర సూట్‌కేసు వుందా?'' బస్సు తిరిగి బయలుదేరబోతుండగా అన్నాడు గోపాలరావు.

''ఊ''నిద్రమత్తులో అన్నది వరలక్ష్మి.

నందిగామలో ఆగింది బస్సు.

ఇద్దరు దిగారు. మరో ఇద్దరిని ఎక్కించుకున్నాడు కండక్టరు.

వారిద్దరూ పల్లెటూరి రైతు దంపతులు. వీరివల్ల హాని ఉండదని నిర్ణయించుకున్నాడు గోపాలరావు.

''ఎర్రసూట్ కేస్ జాగ్రత్త'' అరిచాడు మళ్ళీ బస్సు బయలుదేరుతున్నప్పుడు.

''అబ్బ...మీ చాదస్తం మండిపోను. ఎందుకంత పెద్దగా అరుస్తారు? నిద్ర పోయేవారు లేస్తారు'' కోపంగా అన్నది వరలక్ష్మి.


పాపం ఆయన అరవాలని అరవడంలేదు. ఆయన గొంతు తీరే అంత.

బస్సు సూర్యాపేట దాటింది. అమావాస్య కావడంతో బైట అంతా కటిక చీకటి. ప్రయాణికులంతా గాఢ నిద్రలో వున్నారు.

ఉన్నట్టుండి బస్సు కీచుమంటూ ఆగడంతో అందరూ నిద్రావస్థ నుండి బయటపడ్డారు.

రెండు లైట్లు వెలిగాయి.

కనబడిన దృశ్యం అంత చలిలోనూ అందరికీ చెమ



టలు పట్టించింది.

మొత్తం నలుగురు. ముసుగులు కప్పుకుని వున్నారు.

నలుగురి చేతుల్లోనూ పొడవాటి కత్తులు చీకట్లో మిణుగురుల్లా తళతళ మెరుస్తున్నాయి. కత్తులు నాలుగైదు వంపులు తిరిగి వున్నాయి.

''జాగ్రత్త వీటితో పొడిచి బయటకు లాగామంటే పొట్ట మొత్తం బయటకు వస్తుంది. నోరు మెదిపారంటే మీ పేగులెలా వుంటాయో మీకు చూపిస్తాం'' అన్నాడొకడు కత్తిని గుండ్రంగా తిప్పుతూ.

ఒకడు డ్రైవర్ వద్ద నిలుచున్నాడు. బస్సు నెమ్మదిగా కదులుతున్నది.

గోపాలరావు గుండె నిముషానికి రెండు వందల సార్లు కొట్టుకుంటున్నది. వెనక్కి తిరిగి చూసాడు.

ప్రయాణికులందరినీ చెక్‌చేసి పంపాలని సెలవిచ్చిన యువకులిద్దరూ లేరు. ఆర్టీసీవారికి భద్రత కల్పించడం చేతకాదని విమర్శించినతను లేడు.

అందరం కలిస్తే దొంగలేం చేయగలరని ప్రశ్నించినతను సీట్లో లేడు.

దొంగలెవరో, దొరలెవరో గుర్తించడం సాధ్యం కాదని గోపాలరావుకు అర్థమైంది.

కత్తి గోపాలరావు మెడమీదికొచ్చింది.

''మర్యాదగా ఆ ఎర్ర సూట్‌కేస్ ఇవ్వు'' అన్నాడు దొంగ.

''ఇవ్వను...ఇవ్వను'' వణుకుతూ అన్నాడు గోపాలరావు.

''బాబూ...ఆ నల్లది తీసుకెళ్లండి. రేపు మా అల్లుడి పెళ్లి'' దీనంగా అన్నది వరలక్ష్మి.

''నో రమ్మ

య్యావే'' అంటూ మంగళసూత్రాన్ని, ఎర్ర సూట్కేసును లాక్కున్నారు.

పది నిముషాల్లో దోపిడీ ముగిసింది. ఒక నిర్జన ప్రదేశంలో బస్సునాపించి దొంగలు చీకట్లో పరారయ్యారు.

నార్కెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు బస్సును. అంతా గందరగోళం. ఏడుపులు, పెడబొబ్బలు.

తాము పోగొట్టుకున్న సామానులు, నగలు, డబ్బు వివరాలు రాస్తున్నారు అందరూ. పనిలో పనిగా నాలుగు తులాల గొలుసు పోతే ఆరు తులాల గొలుసని, రెండు గాజులు పోతే నాలుగు గాజులని, వంద రూపాయలు పోతే పదివేలు పోయాయని మొత్తం దోపిడీ అరవై డెబ్బయి వేలకు జరిగితే దాదాపు పది లక్షల రూపాయల దోపిడీ జరిగినట్లు రాసేశారు పెద్ద

వం

సుమైన ప్రయాణికులు.

''తెల్లవారగానే పెళ్లి వుందని'' సెలవు పుచ్చుకున్నారు గోపాలరావు దంపతులు.

''మాస్టారూ! ఎర్రసూట్‌కేస్ అని వందసార్లు అన్నారు. ఏముంది దాన్లో?'' ఆసక్తిగా అడిగాడు కండక్టర్.

నవ్వాడు గోపాలరావు.

''చిరిగిపోయిన పాత గుడ్డలు. డబ్బు, బంగారం అంతా ఈ ప్లాస్టిక్ బుట్టలో వున్నాయి భద్రంగా. దొంగల దృష్టి మళ్లించాలని అలా అన్నాను'' అన్నాడు.

''మరి మీ ఆవిడ గొలుసు?''

''అది రోల్డుగోల్డుది. అయినా ఎనిమిది తులాల గొలుసు పోయిందని కంప్లయింట్ రాశాను. కనీసం నాలుగు తులాలైనా ఇవ్వకపోతారా?'' హుషారుగా బయలుదేరుతూ అన్నాడు గోపాలరావు.

☆

**ఇలపావులూరి మురళీమోహన్‌రావు**